సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

సంక్షేమ పథకాల లబ్ధిపై ఇంటింటా వివరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మండలస్థాయి అధికారులతో వైఎపి నీడ్స్ జగన్, ఆరోగ్యశ్రీ యాప్, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం వై ఎపి నీడ్స్ జగన్ పేరుతో కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతి గ్రామ సచివాలయంలో జరిగేలా ఎంపిడిఒలు ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. ఈనెల 9న ఈ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని, అదే రోజు ప్రతి మండలాల్లో కూడా జరగాలని తెలిపారు. నాలుగున్నరేళ్లలో జరిగిన ప్రగతి, అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజా రక్షణ భేరి పేరిట..

ప్రజల ముందుకు

ప్రజా ప్రణాళికపై విస్తృత ప్రచారమే లక్ష్యం

నేటి నుంచి జిల్లాలో 3 రోజులు సిపిఎం బస్సు యాత్ర

ప్రజాశక్తి - భీమవరం

76 ఏళ్ల స్వాతంత్రంలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలాయి. పాలకులు మారినా ప్రజల స్థితిగతులు మాత్రం మారడం లేదు. అనాదిగా ప్రజానీకం సమస్యల బందీఖానాలో నలిగిపోతున్నారు. విద్య, వైద్యం, ఉపాధి సంపూర్ణంగా దొరకని పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రజల పరిస్థితి దయనీయంగా మారింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, కార్మికులు, స్కీమ్ వర్కర్లు, ప్రజలు అనేక సమస్యల నడుమ బతుకు నెట్టుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక భూమిక పోషిస్తున్న సిపిఎం సరికొత్త ప్రజా ప్రణాళిక రూపొందించింది. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో గతంలో, ప్రస్తుతం పాలిస్తున్న పార్టీలు ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై ఎన్నడూ ఆలోచించని విధంగా సిపిఎం ప్రజా ప్రణాళికలో అన్ని తరగతులూ అభివృద్ధి చెందాలనే ముఖ్యోద్దేశంతో అనేక అంశాలను పొందుపర్చింది. ప్రజల కష్టాలు, కన్నీళ్లు పట్టని ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించేంతగా ప్రజా ప్రణాళిక రచించి ప్రజల ముందు పెట్టింది. అలాగే అన్ని తరగతుల ప్రజల అభివృద్ధితోపాటు దేశ, రాష్ట్ర అభివృద్ధిలో తోడ్పాటునందించాలని, ప్రణాళికలో అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలు జోడించి ప్రభుత్వాల ముందుంచింది. పేదలు, సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, కార్మికులు, స్కీమ్ వర్కర్లు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు, ఉపాధి కూలీలు, అసంఘటిత కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, విద్యార్థులు, వ్యాధిగ్రస్తులు, మహిళలు, పోలవరం నిర్వాసితులు, వెనుకబడిన తరగతులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలు, వికలాంగులు ఇలా అన్ని రంగాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రణాళిక రూపొందించారు. దీనిలో భాగంగా లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజా రక్షణ భేరి చేపట్టారు. ఈ యాత్ర ద్వారా సిపిఎం ప్రజా ప్రణాళికపై విస్తృత ప్రచారం చేసి ప్రజలకు వివరించి ప్రభుత్వాల తీరును ఎండగడుతూ, ప్రజలకు కనువిప్పు కలిగిస్తూ సిపిఎం ముందుకు సాగుతోంది. అసమానతలు లేని అభివృద్ధిలో భాగస్వామ్యమైన సిపిఎం, అన్ని వర్గాల ప్రజానీకానికి అభివృద్ధి, సంక్షేమం అందరికీ అందించాలనే ముఖ్యోద్దేశంతో ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగా ప్రజా రక్షణ భేరి గత నెల 30న ప్రారంభమైంది. ఈ నెల 7వ తేదీన యాత్ర జిల్లాలోకి ప్రవేశించనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రచార జాతాలు ఈ నెల మూడో తేదీన తాడేపల్లిగూడెం, ఆకివీడు ప్రాంతాల నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ప్రచార జాతాలో సిపిఎం ప్రణాళికను ప్రజలకు వివరించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. బస్సు యాత్ర వెళ్లని ప్రాంతాల్లో ప్రచార జాతాల ద్వారా ఈ నెల 15న విజయవాడలో నిర్వహించనున్న బహిరంగ సభపై విస్తృత ప్రచారం సాగించారు.

బస్సు యాత్ర సాగేదిలా..

7.11.23

సాయంత్రం 4.30 గంటలకు కోనసీమ జిల్లా నుంచి మన జిల్లాలోని చించినాడ గ్రామంలోకి ప్రవేశం: స్వాగతం

సాయంత్రం 6 గంటలకు నరసాపురం అంబేద్కర్ సెంటర్‌లో సభ

8.11.23

ఉదయం 9 గంటలకు పాలకొల్లు: స్వాగతం

ఉదయం 10 గంటలకు మార్టేరు సెంటర్‌లో సభ

మధ్యాహ్నం 12.30 గంటలకు తణుకులో సభ

సాయంత్రం 3.30 గంటలకు తాడేపల్లిగూడెంలో సభ

సాయంత్రం 4.30 గంటలకు కేశవరంలో స్వాగతం

సాయంత్రం 5.30 గంటలకు భీమవరం ప్రకాశం చౌక్‌లో సభ

9.11.23

ఉదయం 9 గంటలకు ఉండిలో స్వాగతం

ఉదయం 10.30 గంటలకు ఆకివీడు గాంధీ విగ్రహం వద్ద సభ

అనంతరం ఏలూరు జిల్లాలోకి ప్రవేశం

సకాలంలో ఆపరేషన్లు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో గుర్తించిన 1,670 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు సకాలంలో నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష, తదితర అంశాలపై ముఖ్యమంత్రి జగన్ కలెక్టర్లతో సమీక్షించారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశాంతి సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో గుర్తించిన 1,670 మందిలో ఎంతమందికి కంటి వైద్య పరీక్షలు చేయాలి, ఎంతమందికి శుక్లాల ఆపరేషన్ చేయాల్సి ఉంది తొలుత గుర్తించాలన్నారు. శుక్లాల ఆపరేషన్లు నెట్వర్క్ హాస్పిటల్స్ సహాయంతో డిసెంబర్ నెలాఖరులోపుగా పూర్తి చేసేందుకు పక్కాగా షెడ్యూల్ రూపొందించాలన్నారు.

పాలకొల్లులో వైసిపి జెండా ఎగరేయాలి : మిథున్ రెడ్డి

ప్రజాశక్తి - పాలకొల్లు

సమావేశంలో మాట్లాడుతున్న మిథున్ రెడ్డి

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లులో వైసిపి జెండా ఎగురవేయాలని ఉభయ గోదావరి జిల్లాల వైసిపి సమన్వయకర్త పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కోరారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో సోమవారం జరిగిన పాలకొల్లు అసెంబ్లీ నియోజ కవర్గ వైసిపి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 8న జరిగే సామాజిక బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. నాలుగున్నరేళ్లగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని కోరారు. తమ పార్టీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ప్రాధాన్యతిస్తోందన్నారు. కార్యకర్తలకు ఏ ఇబ్బందులు వచ్చినా తనను కలవాలని కోరారు. మండలంలోని వివిధ కార్యకర్తలతో విడిగా సమావేశమయ్యారు. పాలకొల్లు నియోజకవర్గం నుంచి ఈసారి వైసిపి జెండా రెపరెపలాడుతోందని వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి చెప్పారు. ఈ సమావేశంలో టిటిడి సభ్యులు మేకా శేషుబాబు, చెల్లెం ఆనంద ప్రకాష్, యడ్ల తాతాజీ, చిలువూరి దత్తాత్రేయ వర్మ, నడపన గోవిందరాజులు, చిట్టూరి ఏడుకొండలు చందక సత్తిబాబు, జోగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

జిల్లా ఎస్‌పి ఉప్పాడ రవిప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్పందన అర్జీలపై చట్ట ప్రకారం విచారణ జరిపి, ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి ఉప్పాడ ప్రకాష్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో ఎస్‌పి రవిప్రకాష్, అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బరాజు స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 20 ఫిర్యాదులను ఎస్‌పి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరకట్న వేధింపులు, సరిహద్దుల విషయంలో గొడవలు, సివిల్ వివాదాలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ ఫిర్యాదులపై సంబంధిత స్టేషన్లో సిబ్బందితో ఎస్‌పి మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - భీమవరం

ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ కృష్ణవేణి

స్పందన సమస్యలకు కచ్చితమైన పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలలా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను డిఆర్‌ఒ కృష్ణవేణి, కెఆర్‌సిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బిఎస్.నారాయణరెడ్డి, పీడీ హౌసింగ్ డాక్టర్ ఆర్‌సి.ఆనంద్ కుమార్, పిడిడిఆర్‌డి ఎఎంఎస్ఎస్.వేణుగోపాల్, సిఐ జివిఎస్ పైడేశ్వరరావు 224 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ కృష్ణవేణి మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు మళ్లీ రీఓపెన్ అవ్వని విధంగా కచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వయోవృద్ధులు ట్రిబ్యునల్ మెంబరు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

హారతులిచ్చి.. తిలకం దిద్ది

ఏజెన్సీలో ప్రజారక్షణ భేరి బస్సు యాత్రకు ఘన స్వాగతం

ఎదురెళ్లి స్వాగతం పలికిన మహిళలు, గిరిజనులు

నిర్వాసితుల, ఏజెన్సీ సమస్యలపై గళమెత్తిన నేతలు

జీలుగుమిల్లిలో ఆయుధ కర్మాగారం ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టతివ్వాలి

పునరావాస కాలనీల్లో వసతుల లేమిపై మండిపాటు

ప్రజాసమస్యలపై వినతుల వెల్లువ

జిల్లాలో తొలిరోజు కుక్కునూరు నుంచి కొయ్యలగూడెం వరకూ సాగిన సిపిఎం బస్సు యాత్ర

జీలుగుమిల్లిలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్

ప్రజాశక్తి - ఏలూరు జిల్లా యంత్రాంగం

సిపిఎం చేపట్టిన ప్రజారక్షణభేరి బస్సుయాత్రకు సోమవారం తొలిరోజు జిల్లాలో ఘనస్వాగతం లభించింది. ఉదయం తొమ్మిది గంటలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో కుక్కునూరులో ప్రారంభమైన బస్సు యాత్ర వేలేరుపాడు, జీలుగుమిల్లి, రెడ్డిగణపవరం, రామారావుపేట, బుట్టాయగూడెం, కన్నాపురం, పోలవరం మీదుగా కొయ్యలగూడెం వరకూ సాగింది. యాత్ర బృందానికి జనం ఎదురేగి స్వాగతం పలకడమే కాకుండా మహిళలు హారతులిచ్చి, తిలకం దిద్ది ఆహ్వానించారు. గిరిజన నృత్యాలతో సభావేదిక వద్దకు నాయకులను తోడ్కొని వెళ్లారు. యాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సురేంద్ర, వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, అశోక్, రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగమణి, డిఎన్‌విడి.ప్రసాద్, తెల్లం రామకృష్ణ, జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ప్రతి మండల కేంద్రంలో సభ నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తూర్పారబట్టారు. కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పలు సభల్లో మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టారు. నిర్వాసితుల సమస్యలపై పాదయాత్ర చేపట్టి దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా చేసిన పార్టీ సిపిఎం ఒక్కటేనన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు వైసిపి, టిడిపి, జనసేనలు కేంద్రంలోని బిజెపికి దాసోహమయ్యాయని విమర్శించారు. జీలుగుమిల్లిలో ఏర్పాటు చేయ తలపెట్టిన ఆయుధ కర్మాగారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నాణ్యత, అవినీతిపై న్యాయవిచారణ చేపట్టి దోషులను శిక్షించాలని కోరారు. బుట్టాయగూడెం సభలో వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒకరు మరోసారి సిఎం పదవి కావాలని, మరొకరు ఇంకోసారి అవకాశం ఇవ్వాలని ముందుకొస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నూరుశాతం హామీలు అమలు చేశామని జగన్ చెబుతున్నారని, అలా అయితే కరువు పరిస్థితులు ఎందుకొచ్చాయని, స్కీమ్ వర్కర్ల జీతాల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎందుకొచ్చాయని ప్రశ్నించారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాహనం ఎక్కితే శరీరం గుల్లవుతుందన్నారు. పోలవరం ఎంఎల్‌ఎ నియోజకవర్గంలో రోడ్లు వేయలేకపోవడమేకాక, తాగునీరు కూడా ఇవ్వలేదన్నారు. నిర్వాసితుల కాలనీల్లో తాగునీరు, ఆసుపత్రులు వంటి సదుపాయాలేవీ లేవన్నారు. ఈ ప్రభుత్వం ఇసుక దొంగలకు, భూస్వాములకు, కాంట్రాక్టర్లకు అండగా నిలిచిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలు, ఆశాల జీతాలు పెంచలేదన్నారు. పేదలకు అండగా ఉండేది సిపిఎం మాత్రమేనని, ప్రజలను చైతన్యపర్చేందుకే బస్సుయాత్ర చేపట్టామన్నారు. బిజెపి రాష్ట్రానికి ద్రోహం చేసిందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నోరు మెదపడం లేదన్నారు. సిపిఎం తరపున ఐదుగురు ఎంఎల్‌ఎలు గెలిచినా పేదల పక్షాన ధీటుగా పోరాడుతుందన్నారు. వేలేరుపాడు సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ఎండగట్టారు. కుక్కునూరు సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ నిర్వాసితుల పునరావాసానికి సంబంధించి తమకు సంబంధం లేదని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రోజుకోమాట మాట్లాడుతుందన్నారు. ముంపు మండలాల్లో అభివృద్ధిని కొనసాగించాలన్నారు. ఉపాధి హామీ పనులకు ఏడాదికి రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించి నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. కుక్కునూరు సభకు మండల కార్యదర్శి వై.నాగేంద్రరావు, వేలేరుపాడు సభకు మండల కార్యదర్శి ధర్ముల రమేష్, జీలుగుమిల్లిలో సభకు మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, బుట్టాయగూడెం సభకు మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, పోలవరంలో సభకు మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సభలకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు, ప్రజలు పెద్దఎత్తున తరలొచ్చారు.

న్యూస్‌క్లిక్ సిబ్బందిపై అక్రమ కేసులు దారుణం

తాడేపల్లిగూడెంలో కాపీలు దహనం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - పెంటపాడు

న్యూస్ క్లిక్ పత్రికా సిబ్బందిపై కేంద్ర ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసును రద్దు చేయాలని రైతు సంఘం, సిఐటియు డిమాండ్ చేశాయి. రైతు సంఘాల సమాఖ్య అఖిలభారత కమిటీ పిలుపుమేరకు సోమవారం పెంటపాడులో న్యూస్ క్లిక్‌పై అక్రమంగా పెట్టిన కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రైతు సంఘం నాయకులు చింతకాయల బాబూరావు, చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు నాయకులు సిరపవరపు రంగారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తనకు మద్దతు తెలపని మీడియాపై, ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులను పెట్టి పీడిస్తోందని విమర్శించారు. మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు వెలుగులోకి తెచ్చిన న్యూస్ క్లిక్ మీడియా సంస్థపై కక్షగట్టి వ్యవహరిస్తున్నారని తెలిపారు. సంస్థ ఎడిటర్లు, సిబ్బంది, స్వామిభూతిపరులు, రచయితలపై అక్రమంగా కేసులు బనాయించి జైల్లో పెడుతోందని తెలిపారు. ఈ రకమైన దాడి సరికాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యండ్రపు కృష్ణ, ఎస్‌విఎస్ రెడ్డి, ఆదిరెడ్డి రాజేష్, దత్తు రాము, తెర్లి రాజేష్, మద్దాల సూర్రావు, గిద్ద భద్రరావు, బుద్దాల నూకరాజు, విజయ రెడ్డి పాల్గొన్నారు.

పలుచోట్ల ఎఫ్ఐఆర్ కాపీలు దహనం

గణపవరం : న్యూస్ క్లిక్‌పై అక్రమంగా పెట్టిన కేసులకు నిరసనగా రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పిప్పర వంతెన వద్ద ఎఫ్ఐఆర్ కాపీలను నేతలు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ న్యూస్ క్లిక్ పత్రిక ఎడిటర్‌పై కేంద్ర ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీను, సిఐటియు మండల కార్యదర్శి పి.గోవిందు, పి.నరసింహమూర్తి, సూర్యారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : న్యూస్ క్లిక్ ఎడిటర్‌పై మోడీ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక సిపిఎం కార్యాలయం ఎదురుగా ఉన్న కెఎన్ రోడ్డు వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను హాజరై మాట్లాడారు. న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబిర్ పుర్కయస్తాను, సిబ్బంది ఇళ్లపై పోలీసులు దాడులు చేసి వారిని విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తున్న న్యూస్ క్లిక్ ఛానల్‌పై మోడీ ప్రభుత్వం కక్షగట్టిందన్నారు. అక్రమ అరెస్టులు, బెదిరింపులు మానుకోకపోతే రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాలు చేపట్టి తగు బుద్ధి చెబుతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, గొర్రెల సతీష్ కుమార్, కోలా చంద్రశేఖర్, ఏపూరి శ్రీను, యడవల్లి వెంకన్న, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

ఉండి : భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ మీడియా సంస్థలపై దాడులు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ పిలుపునిచ్చారు. సిఐటియు, రైతు సంఘాల పిలుపుమేరకు యండగండిలో సిపిఎం నేతల ఆధ్వర్యంలో కేసుల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నియంత పాలన సాగిస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేస్తామని చేసిన ప్రకటన నేటికీ వెయ్యి రోజులు పూర్తయ్యిందని తెలిపారు. న్యూస్ క్లిక్ సిబ్బందిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసి భావ ప్రకటనా స్వేచ్ఛను తుంగలో తొక్కిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు కె.తవిటి నాయుడు పాల్గొన్నారు.

ఆకివీడు : న్యూస్ క్లిక్ సిబ్బందిపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తవిటి నాయుడు మాట్లాడారు. అనంతరం కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో బి.అప్పలనాయుడు, నెల్లి సూరిబాబు, మణిపురి.సత్యనారాయణ, ధనుష్, షేక్ వలీ పాల్గొన్నారు.

ఆకివీడులో ధర్నా చేస్తున్న నేతలు

జిల్లాలో పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పాలకొల్లు : రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మండలంలో సోమవారం మధ్యాహ్నం వర్షం పడింది. పలు చోట్ల భారీ వర్షం పడింది. దీంతో ఈనిక దశలో ఉన్న వరిచేలు నేలకొరిగాయి. వర్ష ప్రభావం దిగుబడిపై పడుతుందని, తెగుళ్ల ఉధృతి పెరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం వల్ల రోడ్లు అధ్వానంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఆచంట : వాయుగుండం ప్రభావంతో మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేని వర్షం పడింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెనుమంచిలి, ఆచంట వేమవరం, వల్లూరు, భీమలాపురం, కరుగోరుమిల్లి తదితర గ్రామాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో రైతులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. పంట పొలాలు ఈనిక దశలో, పాలు పోసుకునే దశలో ఉండడంతో వరిచేలు ఎక్కడ ఒరిగిపోతాయని భయాందోళనలకు గురవుతున్నారు.

పాలకొల్లు : పాలకొల్లులో సోమవారం మధ్యాహ్నం గంటన్నర పాటు భారీ వర్షం పడింది. దీంతో రోడ్లు, డ్రెయిన్లు ఏకమై మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. వర్షానికి బస్టాండ్ నీట మునిగి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పిపి రోడ్డు పరిస్థితి దారుణంగా తయారైంది.

గణపవరం : వరి కోతలు దగ్గర పడుతున్న సమయంలో వాతావరణ మార్పుల నేపథ్యంలో మండలంలో సోమవారం వర్షం పడింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 11,800 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు ప్రస్తుతం సిహెచ్ అగ్రహారంలో 650 ఎకరాలకు 200 ఎకరాల్లో వరి కోతలు ప్రారంభించి ధాన్యం అమ్మకాలు ప్రారంభించారు. వర్షం పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజా రక్షణ భేరి జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - పెనుగొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ 15న విజయవాడలో జరుగుతున్న ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని దొంగరావిపాలెంలో సోమవారం నిర్వహించిన వ్యవసాయ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిత్యవసర సరుకుల ధరలు, కరెంటు ఛార్జీలు, పెంచుతూ పేదలపై మోయలేని భారాలు విధించిందన్నారు. పెనుగొండలో విష జ్వరాలు విస్తృతంగా ఉన్నా ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని తెలిపారు.

నరసాపురం టౌన్ : లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ ఏడో తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతాలవారీగా బస్సు యాత్ర జాతాలు జరుగుతున్నాయన్నారు. ఏడో తేదీన సాయంత్రం నాలుగు గంటలకు పట్టణంలో స్టీమర్ రోడ్డులో సిపిఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు పొన్నాడ రాము, నారాయణరావు, నీలకంఠం, బూడిద జోగేశ్వరరావు, నోముల కొండబాబు రామ్మోహన్‌రావు, గుబ్బల చిన్ని పాల్గొన్నారు.

తణుకు రూరల్ : ఈ నెల ఎనిమిదో తేదీన తణుకులో జరుగుతున్న ప్రజా రక్షణ భేరి యాత్ర సభకు పెద్దఎత్తున తరలి రావాలని సిపిఎం కార్యదర్శి పి.వి.ప్రతాప్ కోరారు. స్థానిక అమరజీవి భవనంలో కామన మునిస్వామి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ప్రతాప్ పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేయకుండా ఎపి ప్రజలను మోసం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కరెంట్ ఛార్జీలు, చెత్త, ఆస్తి వంటి భారాలు ప్రజలపై వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, అజయ కుమారి, బళ్ల చినవీరభద్రం, వెంకటేశ్వరరావు, గుబ్బల గోపీ పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి దుకాణాల పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు దుకాణదారులకు సూచించారు. స్థానిక లూథరన్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన దీపావళి మందు గుండు సామగ్రి దుకాణాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణదారులతో మాట్లాడుతూ ప్రతి దుకాణం వద్ద మూడు మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్, ఫైర్ జిల్లా ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులు దంతాలను సంరక్షించుకోవాలని పెనుమంట్ర విజయ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్, కరస్పాండెంట్ తేతలి సంజీవరెడ్డి అన్నారు. పెనుమంట్ర విజయ పబ్లిక్ హైస్కూల్‌లో భీమవరం విష్ణు డెంటల్ కాలేజీ, హాస్పిటల్ వైద్య నిపుణులతో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ శిబిరంలో 500 మంది విద్యార్థులకు చికిత్స చేసినట్లు తెలిపారు.

వెలగలేరులో...

వెలగలేరు సంఘమిత్ర స్కూల్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పెనుగొండ రత్న డెంటల్ క్లినిక్ వారు సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మేడపాటి మురళి జోగిరెడ్డి విద్యార్థులకు పంటి సమస్యల పట్ల అవగాహన కల్పించారు. ఈ స్కూల్ విద్యార్థులు తమ క్లినిక్‌కు వస్తే మానవత సంస్థ తరపున ఉచితంగా దంత వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచి కొవ్వూరి మధువాణి, విజయకుమార్‌రెడ్డి, మానవత జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, ఛైర్మన్ చిర్ల సూర్యనారాయణరెడ్డి, సంఘమిత్ర కరస్పాండెంట్ కె.సతీష్‌వర్మ, ప్రిన్సిపల్ టిహెచ్.సుందరాచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల పరిశీలన

మొగల్తూరు :మండల కేంద్రమైన మొగల్తూరులోని డ్రెయిన్‌లను సోమవారం పంచాయతీ పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. డ్రెయిన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల ఐదో తేదీన సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో నిరసన ప్రదర్శన చేశారు. దీనిపై పంచాయతీ పాలకవర్గం స్పందించి డ్రెయిన్‌లను పరిశీలించారు. మురుగునీరు పారేందుకు డ్రెయిన్‌ల ప్రక్షాళనకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీసత్యనారాయణ, ఉపసర్పంచి బోణం నరసింహరావు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొత్త పాలానికి చెందిన ఇంకేటి మనోహరం ద్విచక్రవాహనంపై 216 జాతీయ రహదారిపైకి వస్తుండగా ముత్యాలపల్లి వైపు నుంచి నరసాపురం వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మనోహర్, మరో ద్విచక్రవాహనదారుడు కె.ముత్యాలు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో నరసాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మనోహరంను భీమవరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి, తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజ్‌మేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్, ఫోటోషాప్‌లో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చిత్రలేఖనంలో కాళ్ల విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - కాళ్ల

అందంగా బొమ్మలు గీసి రంగులు అద్ది తమ ప్రతిభను చాటుతున్నారు విద్యార్థినులు. పాఠశాలలో విద్యార్థులు వివిధ చిత్రాలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు గ్రామీణ వాతావరణం, పర్యావరణం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం అంశాల్లో బొమ్మలను గీస్తూ ఆకట్టుకుంటున్నారు. బాలల మానసిక వికాసానికి, విద్యాభ్యాసం ద్వారా ఉన్నత శిఖరాలకు ఎదగడానికి కళలు అవకాశం కల్పిస్తాయి. చిత్ర లేఖనం పోటీలు వంటివి పిల్లల్లో కళల పట్ల అంతర్గతంగా ఉన్న సృజనాత్మకతను, శక్తిని బయటకు తీయడానికి ఎంతో అవసరం. విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం ద్వారా ప్రతిభావంతులుగా తయారవుతారన్నారని ఇద్దరు అక్కాచెల్లెలు నిరూపించారు.

విద్యార్థులు, బాల బాలికల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి అడవి బాపిరాజు స్మారకోన్నత చిత్రలేఖనం బాలోత్సవం ఇటీవల భీమవరంలో చింతలపాటి బాపిరాజు హైస్కూల్లో నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీల్లో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కాళ్ల గ్రామానికి చెందిన మేక ప్రణతి జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి, మేక నాగసాయి లక్ష్మీప్రసన్న సీనియర్ కేటగిరీలో నాలుగో బహుమతి సాధించింది. మేక మహంకాళి (కాళి చరణ్), గీత దంపతుల కుమార్తెలు నాగసాయి లక్ష్మీప్రసన్న, ప్రణతిలు చిత్రలేఖనం పోటీలో ప్రతిభ చూపారు. నాగసాయి లక్ష్మీప్రసన్న పదో తరగతి, ప్రణతి నాలుగో తరగతి భీమవరంలో భారతీయ విద్యా భవన్ స్కూల్లో చదువుతున్నారు. మేక ప్రణతి 4, 5, 6వ తరగతుల మధ్య నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పాల్గొంది. వివిధ స్కూళ్ల నుంచి వచ్చిన విద్యార్థులు 2,300 మంది చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలో మేక ప్రణతి మంచి ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి దక్కించుకుంది. 7, 8, 9, 10 తరగతులకు సంబంధించి పర్యావరణ పరిరక్షణ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మేక నాగసాయిలక్ష్మీప్రసన్న ప్రతిభ చూపి నాలుగో బహుమతి సాధించింది. డిఇఒ ఆర్‌వి.రమణ చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు. చిన్నారులను ప్రోత్సహిస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులను, స్కూల్ టీచర్స్‌ను పలువురు అభినందించారు.

బహుమతులతో చిన్నారులు

మావుళ్లమ్మ ఆలయం మరింత అభివృద్ధి

యాత్రికులకు అన్ని సౌకర్యాల కల్పనకు కృషి
ఆలయ సహాయ కమిషనర్, ఇఒ యర్రంశెట్టి భద్రాజి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణం ఇలవేల్పుగా జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రంగా మావుళ్లమ్మ ఆలయం వెలుగొందుతుంది. మావుళ్లమ్మ దర్శనానికి పట్టణ యాత్రికులతో పాటు ఇతర రాష్ట్రాల, జిల్లాల నుంచి యాత్రికులు తరలివస్తారు. ముఖ్యంగా అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రతి ఏటా సంక్రాంతి నెలలో ప్రారంభమవుతాయి. నెలరోజులకు పైగా ఘనంగా ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఆలయాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, త్వరలోనే యాత్రికులకు కావాల్సిన మరిన్ని ఏర్పాట్లు చేయనున్నామని ఆలయ సహాయ కమిషనర్ ఇఒ యర్రంశెట్టి భద్రాజి తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మావుళ్లమ్మ దర్శనానికి విచ్చేసిన ప్రతి ఒక్క యాత్రికునికి అమ్మవారి ప్రసాదంగా భావించే ఉచిత అన్నదానాన్ని అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన యాత్రికులకు నిత్యాన్నదానం గతంలో వంద మందికి పెట్టేవారమని, ప్రస్తుతం 175 మంది నుంచి 250 మంది యాత్రికులకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు. అన్నదానం ఏర్పాటు చేసేందుకు సరైన స్థలం లేక యాత్రికులు ఇబ్బందిగా ఉందన్నారు. తమ సిబ్బంది కూడా ఇరుకు గదిలో నిత్యం యాత్రికులకు భోజనాలు అందించడం ఇబ్బందిగానే ఉందని చెప్పారు. ఈ సమస్యను అధిగమించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తామన్నారు. దీనిలో భాగంగా అన్నదానానికి అనుకూలంగా ఉండే భవనం కోస ఆలయ పాలకవర్గ సభ్యులు, తాము అన్వేషిస్తున్నామన్నారు. అమ్మవారికి స్వర్ణ కవచం చేసేందుకు బంగారం సేకరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 51 కేజీలు ఉందన్నారు. దాతలు ఇచ్చిన బంగారంతో ఉందని, స్వర్ణకవచం చేయించేందుకు బంగారం సేకరిస్తున్నామని తెలిపారు. అమ్మవారికి స్వర్ణకవచం చేయించే విధంగా బంగారాన్ని తిరుపతి తరలించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇంకా 35 కేజీలు కావాల్సి ఉందని, యాత్రికులు ఎవరైనా విరాళంగా ఇవ్వాల్సినవారు ఆలయ అధికారులకు అందించాలని తెలిపారు. ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ సూచన మేరకు పాలకవర్గం ఆధ్వర్యంలో ఆలయాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, త్వరలోనే యాత్రికులకు కావాల్సిన మరిన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఆలయంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించామని తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, అఖండ అన్న సమారాధన నిర్వహించామని తెలిపారు.

యర్రంశెట్టి భద్రాజి

8న విద్యాసంస్థల బంద్ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - పాలకొల్లు

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షించాలని కోరుతూ నవంబర్ ఎనిమిదో తేదీన విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలని ఎఐఎస్‌ఎఫ్ కోరింది. ఈ మేరకు పాలకొల్లు ఎంఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.సుందర్ మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని, దశబ్దానికి పైగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నా ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. కార్పొరేట్ వ్యక్తుల కోసం విశాఖ ఉక్కును బలి చేస్తున్నారని, దీని తిప్పి కొట్టేందుకు ఎనిమిదో తేదీన జరిగే రాష్ట్ర వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి యువజన సంఘం నాయకులు, ఎఐఎస్‌ఎఫ్ పట్టణ నాయకులు రాంప్రసాద్, మణిదీప్, బన్ని, సంతోష్, ఎస్‌ఎఫ్‌ఐ పాలకొల్లు నాయకులు కె.యశ్వంత్, పొలిశెట్టి శేఖర్ పాల్గొన్నారు.

ఆచంట :విశాఖ ఉక్కు పరిరక్షణ, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, ఇతర ప్రజాతంత్ర విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల ఎనిమిదో తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు టి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, విభజన హామీలు అమలు చేసి రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

నరసాపురం టౌన్ : ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కమిటీ సమావేశం స్థానిక మీరా స్మారక గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షులు ఎమ్‌డి.జాన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ ఎనిమిదో తేదీన చేపట్టనున్న విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, యువకులు, పట్టణ పౌరులందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి మురళి, సహాయ కార్యదర్శులు మనస్విని, ఎం. సాయికృష్ణ, కమిటీ సభ్యులు సాగర్, ఉమేష్‌కుమార్, ఎన్.హర్ష, బి.హేమన్, సూరజ్ కుమార్, జి.సిరి, ప్రవళిక, సన పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ పరిరక్షణ బంద్‌కు సంపూర్ణ మద్దతు : సిపిఎం

భీమవరం :విశాఖ స్టీల్ పరిరక్షణకు ఈ నెల 8వ తేదీన విద్యార్థి, యువజన సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల రాష్ట్ర బందుకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ ఉక్కు రాష్ట్రానికే కాకుండా దేశ ప్రజలకు గర్వించదగ్గ సంస్థన్నారు. దేశంలోనే విశాఖ ఉక్కు కర్మాగారం కీలకమైందన్నారు. కోవిడ్ సమయంలో దేశ ప్రజలకు, ప్రపంచ దేశాలకు ఆక్సిజన్ సప్లై చేసిన ఘనత విశాఖకు ఉందన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవమైన విశాఖ ఉక్కు పరిశ్రమను నిరంకుశంగా కేంద్ర ప్రభుత్వం ప్రయివేట్ వ్యక్తులకు కారు చౌకగా అమ్మేస్తుండటం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర రాజకీయ పార్టీలు కనీసం తప్పుపట్టడం లేదన్నారు. విశాఖ ఉక్కు వల్ల లక్షలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు ప్రజలందరూ ఐక్యంగా ముందుకు కదలాలని పిలుపునిచ్చారు.

ఉపాధి హామీ పనులు వంద రోజులు కల్పించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉపాధి హామీ చట్టంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం 2022-2023 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ నివేదికలపై ఎంపిడిఒ ఉండ్రు బాబ్జిరాజు అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ అందరికీ పని కల్పించేందుకు అవసరమైన పనులు గుర్తించాల న్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ కె.విజయలక్ష్మి, ఎపిఇ సాగర్, డిపిఎం టి.మురళీకృష్ణ, ఎపిఒ వై.శ్రీనివాస్, ఎస్‌ఆర్‌పి కె.మన్మథరావు, టెక్నికల్ అసిస్టెంట్ జె.వెంకటేశ్వరరావు, పిఆర్ ఎఇ అశోక్, సర్పంచి వెంకన్న, ఎంపిటిసి సభ్యులు సుశీల పాల్గొన్నారు.

పలుచోట్ల 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని దిరుసుమర్రులో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ నవరత్నాల పథకాల పేరుతో వైసిపి ప్రజలను వంచన చేసిందన్నారు. సిఎం జగన్ పరిపాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమన్నారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి క్లస్టర్ ఇన్‌ఛార్జి పృధ్వీశంకర్ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందించేవారన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి పులపర్తి రామాంజనేయులు, బూత్ ఇన్‌ఛార్జిలు దొంగ శ్రీనివాస్, మొల్లి గంగాధర్, గుడాల రామకృష్ణ, కవురు యుగంధర్, దానియేలు, రావి లాజర్ పాల్గొన్నారు.

మొగల్తూరు :మండలంలోని ముత్యాలపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ టిడిపి బాండ్లను నాయకులు ప్రజలకు పంపిణీ చేశారు. మండలంలోని ముత్యాలపల్లిలో టిడిపి మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగిడి రాంబాబు, కొల్లాటి మూలస్వామి, కొల్లాటి పెంటయ్య, నాగేశ్వరరావు, దొంగ శ్రీను, కొల్లాటి బాలకృష్ణ, బందన విజయకుమార్, తిరుమణి వెంకటేశ్వర్లు ఉన్నారు.

టిడిపితోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మండలంలోని పేరుపాలెం నార్త్‌లో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి టిడిపి బాండ్లను ప్రజలకు అందించారు. మాజీ సర్పంచి కవురు ముత్యాలరావు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కత్తిమండ ముత్యాలరావు, పాల రాంబాబు, చల్ల సుబ్రహ్మణ్యం, సత్తినేని త్రిమూర్తులు పాల్గొన్నారు.

జల్లి కొమ్మరలో 'ఇంటింటికి జనసేన'

గణపవరం : మండలంలోని జల్లికొమ్మరిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పచ్చమట్ల ధర్మరాజు మాట్లాడుతూ వైసిపి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రోడ్లు, డ్రెయినేజీలు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. ప్రతిపక్ష పార్టీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు మహంకాళి, మండల నాయకులు తోట శ్రీను, తేజ పాల్గొన్నారు.

'ఉండిలో మళ్లీ టిడిపిదే విజయం'

ఉండి :తెలుగుదేశం కంచుకోట ఉండి నియోజకవర్గంలో పాగా వేసేందుకు అధికార పార్టీ కుయుక్తులు పన్నుతుందని, వాటిని తిప్పికొట్టి మళ్లీ టిడిపి జెండాను రెపరెపలాడిస్తామని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని పెదపుల్లేరు గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షులు నడింపల్లి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం ఇంటింటికి మన రాంబాబు కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు ఇవ్వాలని లబ్ధిదారుల ఆందోళన

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి ప్రభుత్వం టిడ్కో గృహాలు ఉచితమని చెప్పి బ్యాంకులకు తాకట్టు పెట్టిందని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. టిడ్కో లబ్ధిదారులతో ఆయన పాలకొల్లు సెంట్రల్ బ్యాంక్‌కు సోమవారం వెళ్లగా 59 మంది గృహస్థులకు రూ.2 కోట్ల రుణాలు ఇచ్చినట్లు బ్యాంకు మేనేజర్ చెప్పారు. ఇంటి ధృవపత్రాలు ఉచితంగా ఇస్తామని సబ్ రిజిస్ట్రార్ దగ్గర లబ్ధిదారులతో సంతకాలు పెట్టించుకుని ఆ పత్రాలు ఇవ్వకుండా బ్యాంకులకు తాకట్టు పెట్టినట్లు ఎంఎల్‌ఎ చెప్పారు. ఎన్నికలు ఉండటంతో రెండేళ్లు నోటీసులు పంపవద్దని ప్రభుత్వం బ్యాంకులకు సూచించిందన్నారు. రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు బాకీలు కట్టాలని నోటీసులు రావడంతో గృహస్థులు లబోదిబోమంటున్నారు. దీంతో లబ్ధిదారులు తమకు ఉచితంగా ఇళ్లు ఇవ్వాలని బ్యాంకు వద్ద నినాదాలు చేశారు.

దేశ భవిష్యత్తును నిర్ణయించేవి ప్రయోగశాలలే

తాడేపల్లిగూడెం : దేశ భవిష్యత్తును నిర్ణయించేవి తరగతి గది, ప్రయోగశాలలేనాని ఎస్‌ఎన్.బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్ (కోల్‌కతా) శాస్త్రవేత్త డాక్టర్ ఆయాత్తి మల్లిక్ గుప్తా తెలిపారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్)లోని బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఇన్‌సిలికో మాక్రో మోలక్యులర్ మోడలింగ్, వర్చువల్ స్క్రీనింగ్ అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాపును సోమవారం ప్రారంభించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బయోటెక్నాలజీ విభాగాదిపతి డాక్టర్ సుదర్శన దీప అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథి మల్లిక్ గుప్తా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరరెడ్డి, ఆచార్యులు డాక్టర్ జగన్ మోహనరావు, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం, మానసిక వికాసం

ప్రజాశక్తి - పాలకొల్లు

క్రీడలు దేహధారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి దోహదపడతాయని వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ అన్నారు. పాలకొల్లు దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాలలో రూ.56 వేలతో కబడ్డీ, వాలీబాల్, టెన్నీకాయిట్ గ్రావెల్ కోర్టులను వాకర్స్ క్లబ్ ఏర్పాటు చేసింది. వివిధ ఆటల్లో ప్రావీణ్యత చూపుతున్న పది మంది కళాశాల విద్యార్థినులకు రూ.19 వేలతో బూట్లు, జెర్సీలు అందించారు. కార్యక్రమానికి కళాశాల ఉప ప్రధానాచార్యుడు రవిశేఖర్ అధ్యక్షత వహించగా క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్ విద్యార్థినులకు మార్గనిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి పోతుల ఉమాశంకర్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కళాశాల సహాయక వ్యాయామ అధ్యాపకురాలు కోట సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు పివిఎల్ పరామర్శ

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడులో తెలగపాముల దాడిలో గాయపడిన ముఠా కార్మికులను స్థానిక సంతపేట వద్ద డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ప్రత్యేకంగా తెలియపరిచామన్నారు. త్వరలో పోలీసులు సంఖ్య పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. దాడిలో ప్రధాన పాత్ర పోషించిన మహేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారని చెప్పారు. గాయపడినవారిపై ఎటువంటి కేసులు ఉండవని ఆయన బాధితులకు హామీ ఇచ్చారు. పివిఎల్‌తో పాటు ఆ పార్టీ నాయకులు ఛైర్‌పర్సన్ జామ్ హైమావతి, మెప్మా అధ్యక్షురాలు మొర జ్యోతి, ఎఎంసి ఛైర్మన్ రసూల్ బేబి, స్వయం సహాయ సంఘాల మెప్మా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పళ్లెం అరుణకుమారి, సహకార బ్యాంక్ అధ్యక్షులు కేసిరెడ్డి మురళి, బిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జగరోజు విజయ్, పార్టీ పట్టణ అధ్యక్షులు గుండా సుందరరామనాయుడు చిన్ని, గాలి సామ్రాజ్యం, కుంచాడు బాబ్జి పాల్గొన్నారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బంగారు వేలం ప్రకటన
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
ELURU AREA CELL NO. 8074656196

S.R.K.R. ENGINEERING COLLEGE (AUTONOMOUS)
Accredited by AICTE, New Delhi and Affiliated to JNTUK, Kakinada,
NAAC with 'A' Grade, CHINNA AMIRAM (PO) :: BHIMAVARAM, W.G.Dt.
☎ 98488 23332
ADMISSION NOTIFICATION FOR M. TECH (CATEGORY-B ADMISSION: 2023-2024)
Candidates seeking admission into M. Tech Courses under Category-B admission for the academic year 2023-24, shall contact college office along with original certificates on or before 09-11-2023, 5.00 PM.
The admissions will be made as per guidelines from APSCHE
Principal

ఉచిత దంత వైద్య సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం మున్సిపల్ ఆఫీస్ రోడ్డులోని చినమిల్లి డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగే ఉచిత దంత వైద్య పరీక్ష శిబిరాన్ని సోమ వారం శ్రీ గౌతమి విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ చినమిల్లి దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గౌతమి కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ దంత వైద్యులు కె.రవి రాజుతో పాటు డాక్టర్ కె.ఉదయని వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా చినమిల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నరసాపురం పరిసర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచితంగా వైద్య సేవలు, వివిధ రకాల వైద్య పరీక్షలను తమ చినమిల్లి డయాగ్నోస్టిక్ సెంటర్ ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గౌతమి స్కూల్ కరస్పాండెంట్ ఎమ్.డి.గాఫర్ ఖాన్, ప్రిన్సిపల్ రామచంద్రరావు, లెనిన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం : పివిఎల్

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన కొనసాగుతోందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ కన్వీనర్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. జగన్ పాదయాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పివిఎల్.నరసింహరాజు చేతులమీదుగా బట్టలు పంపిణీ చేశారు. తొలుత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన గౌడ వీధి పెద్దపేట మహిళా సర్వసభ్య సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : ప్రజా సంకల్ప యాత్రలో సిఎం జగన్ అన్ని వర్గాల ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని వాటిని శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేదిశగా చర్యలు తీసుకున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జగన్ ప్రజా సంకల్ప యాత్ర పూర్తిచేసుకుని సోమవారంతో ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూడా ఈ నాలుగున్నరేళ్లలో 98 శాతానికి పైగా అమలు చేసి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు.

డాక్యుమెంట్లు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు మండలం, తణుకు, పాతవూరుకి చెందిన నకెళ్ళ మురళీ కిషోర్‌కుమార్, తండ్రి: నకెళ్ళ కనకరాజు అను నేను మా నాన్న గారు అయిన నకెళ్ళ కనకరాజు ఇంటి ఒరిజినల్ రిజిస్ట్రర్డ్ **డాక్యుమెంటు నెం. 1999/1982** గల **డాక్యుమెంటు ది.26-10-2023వ తేదీన** తణుకు నుండి రాజమండ్రి వెళ్ళుతుండగా తణుకు కేశవ స్వామి గుడి సమీపమున ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్సు పడిపోయినవి. ఎంత వెదకినా డాక్యుమెంట్సు దొరికలేదు. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకి తెలియజేయగలరు.

నకెళ్ళ మురళీ కిషోర్ కుమార్
తండ్రి: కనకరాజు, డో.నెం. 4-2-17/1,
పాతవూరు, తణుకు, ప॥గో॥జిల్లా.
సెల్: 93818 38609

In the Court of the Hon'ble Addl. Senior Civil Judge, Eluru, W.G.Dist.,
I.A. No. /2023 in I.P. No. 2/2023

Between:
Donka Venkateswara Rao ...*Petitioner*
Terrala Nageswara Rao & Others ...*Respondents*

To:
R-6: పై నంబరు గ్రంధంలో
Balla Tulasi N Baga Pulla Rao, S/o. Dasu, R/o. 9th Division, Ramalayam Veedi, DSP gari Road, Eastren ...... The Official Receiver, W.G.Dist., Eluru

అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 28-11-2023 ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల తమ పరోక్షమున సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జుజ్జవరపు ప్రసాద్
అడ్వకేట్, ఏలూరు
సెల్: 90002 66396

మహారాజశ్రీ ఏలూరు Motor Accidents Claims Tribunal (I Addl. Dist. Judge) Eluru, W.G.Dist.,
M.V.O.P.No. 183/2023

Between:
Saiyala Venkata Ramana & Others ...*Petitioners*
AND
Allapureddy Ramesh Reddy & Others ...*Respondents*

TO:1st Respondent: Allapureddy Ramesh Reddy, S/o. Somireddi, Driver of Eicher Van No. AP 39 TG 1444, D.No. 2/63, Main Road, Bodagani Doddi, Bukkaraya Samudram, Ananthapuram Dist.,
TO: 2nd Respondent: Anke Bhavani, W/o. Siva Sankar, Owner of Eicher Van No. AP 39 TG 1444, D.No.1-258, Reddypalli, Bukkaraya Samudram, Ananthapuram Dist.,

పై నెంబరు 1వ రెస్పాండెంటు, 2వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్ని పర్యాయములు కోర్టు నోటీసు పంపినా అమలు జరగనందున ఈ పబ్లికేషన్ ద్వారా కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున **ది.09-11-2023 మీరు గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట స్వయంగా హాజరై సమాధానం తెలుపుకొనగలరు.** అట్లు జరగని ఎడల మీ పరోక్షమున తీర్మానం జరుపబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఏలూరు, **గాడిలి ఉగ్రనరశింహారావు**
8-9-23. పిటీషనరు తరుపు అడ్వకేట్